క్లుప్తంగా

పరీక్షల సన్నద్ధతపై అవగాహన

సరుబుజ్జిలి: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చునని శ్రీకాకుళం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దూసి సూర్యవిజయభరద్వాజ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సేవాభావం అలవాటు చేసుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రావిల్లి భూషణరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో రమేష్‌సాహు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో శాలరీ ఖాతా ఉంటే ఉచిత బీమా వర్తింపు

నరసన్నపేట: స్టేట్‌బ్యాంక్‌లో జీతాల ఖాతా ఉన్న ఖాతాదారులు తమ ఖాతాను శాలరీ ప్యాకేజీ అకౌంట్లోకి మార్చుకొంటే ఉచిత బీమాతో పాటు మరిన్ని సౌకర్యాలు పొందవచ్చని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ టీఆర్‌ఎం రాజు తెలిపారు. సారవకోట మండలం అంగూరుకు చెందిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి లింగిబేరి రవి ప్రమాదంలో మరణించగా ఆయన నామినీకి ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ నుంచి రూ. 50 లక్షలు బీమా చెల్లించామని తెలిపారు. ఈ మేరకు చెక్కును రవి భార్య రోహిణికి గురువారం ఇచ్చామని అన్నారు. నరసన్నపేట చీఫ్ మేనేజర్ రుప్ప సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



తెలికిపెంట కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: మండలంలోని తెలికిపెంట, పాతపాడు, అగ్రహారం, చినకాగితాపల్లి, రొట్టవలస గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జె.రమేష్‌బాబు గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు సంబంధించిన ర్యాంపులు, ఇతరత్రా సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్‌కు ముందు రోజు కేంద్రాలకు చేరుకునే సిబ్బంది ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. పరిశీలనలో ఆర్‌ఐ బాబూరావు, వీఆర్వోలు, బీఎల్వోలు, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

కొరసవాడ విద్యార్థుల ప్రతిభ

పాతపట్నం: టెక్కలిలో జరిగిన జోన్-2 స్కూల్ లెవెల్ గ్రిగ్స్ పోటీల్లో కొరసవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హెచ్‌ఎం బి.సింహాచలం చెప్పారు. విజేతలను పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కబడ్డీ, షాట్‌పుట్, 300, 1500 మీటర్ల రన్నింగ్, ట్రిబుల్, లాంగ్, హైజంప్ విభాగాల్లో 17 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అలాగే పెద్దసీది జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆల్‌రౌండర్ చాంపియన్‌గా నిలిచారని పీడీ సిమ్మ కృష్ణారావు తెలిపారు. విజేతలను హెచ్‌ఎం బి.రామమూర్తి, మధుసూదనరావు, ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ జె.కృష్ణ, మహాలక్ష్మి, ఎం.రామారావు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రికి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం శ్రీముఖలింగేశ్వర దేవాలయాభివద్ధికి సహకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆలయ అర్చకుడు నాయుడుగారి రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం ఆయన కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లాలోని ఈ ఆలయాన్ని ప్రపంచ వారసత్వ సంపద జాబితాలో చేర్చేందుకు చొరవ చూపాలని కోరారు. అంతకుముందు.. ఇదే అంశంపై కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ కిశోర్ కే బాషాను కలిసి ఆలయ పరిస్థితిని వివరించారు. అనంతరం ప్రత్యేక నిధులతోనైనా ఆలయాన్ని అభివద్ధి చేయాలని కోరుతూ.. రాష్ట్రపతి కార్యాలయంలో రాజశేఖర్ వినతి పత్రం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు



చక్రతీర్థ స్నానాలు చేస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చక్రతీర్థ స్నానాలు గురువారం భక్తిశ్రద్ధలతో వంశధార ఎడమ కాలువలో నిర్వహించారు. ఈ ఆలయంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ఈ చక్రతీర్థ స్నానాలు నిర్వహించినట్లు అర్చకులు కొరపాక సిద్ధయ్య స్వామి తెలిపారు.

ఉపాధ్యాయుల ఉదారత

పోలాకి: మండలంలోని ఉపాధ్యాయులు తమ వద్ద చదువుకుంటున్న విద్యార్థినికి క్యాన్సర్ చికిత్స కోసం ఆర్థిక సాయం చేశారు. ముప్పిడి ప్రాథమిక పాఠశాల విద్యార్థిని గంగు పల్లవి కంటికి సంబంధించిన క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ విషయం టీచర్లకు తెలియడంతో మండలంలోని ఉపాధ్యాయులంతా కలసి రూ.94,500 ను సేకరించి విద్యార్థిని కుటుంబ సభ్యులకు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి టి.లింగరాజు, స్థానిక ప్రధానోపాధ్యాయులు బి.శ్యామలరావు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు చింతాడ దిలీప్‌కుమార్, నర్సింహులు, రాజేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిపుత్రులకు మెరుగైన వైద్యం



అధునాతన హంగులతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాలు

- రూ 1.84 కోట్లతో పీహెచ్‌సీ భవనాల నిర్మాణం
- ఆనందం వ్యక్తం చేస్తున్న 36 గిరిజన గ్రామాల ప్రజలు



అధునిక పరికరంతో రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



సారవకోట: ప్రజారోగ్యమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. మారుమూల గ్రామీణ ప్రజలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు కావాల్సిన వనరులను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గిరిజనులకు సైతం వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వారికి అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించింది. ఇందులో భాగంగా నరసన్నపేట నియోజకవర్గం పరిధి సారవకోట మండలం బొంతు జంక్షన్‌కు సమీపంలో రూ 1.84 కోట్లతో అన్ని హంగులతో పీహెచ్‌సీని నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు హడావుడిగా పీహెచ్‌సీని మంజూరు చేసి ఒక అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. అయితే మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్ద పీట వేయడంతో నరసన్నపేట ఎమ్మెల్యే బొంతు జంక్షన్లో ఉన్న ప్రభుత్వ స్థలంలో రూ. 1.84 కోట్లు వెచ్చించి అధునాతన హంగులతో పీహెచ్‌సీకి భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు వైద్యులతోపాటు పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో పది సచివాలయాలకు చెందిన 36 గిరిజన గ్రామాలకు వైద్య సేవలందుతున్నాయి. ఇదివరకు సారవకోట పీహెచ్‌సీకి వచ్చే వారంతా ప్రస్తుతం బొంతు పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్నారు.

63 వైద్య పరీక్షలు

ప్రభుత్వం ఇక్కడ నిర్మించిన పీహెచ్‌సీలో ప్రస్తుతం 63 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంట్లో సాధారణ యూరిన్, సుగర్, హెచ్‌బీ పరీక్షలతో పాటు సీబీసీ, బయో కెమికల్ ఎనలైజర్, సీరం ఎలక్ట్రోలైట్స్ ఎనలైజర్ యంత్రాల ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఇక్కడ అందుతున్నాయి.

మెరుగైన వైద్య సేవలు



పీహెచ్‌సీలో వివిధ రకాల రక్త, యూరిన్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలతో వచ్చే ఫలితాల ప్రకారం వైద్యులు పరీక్షించి కావల్సిన మందులు అందిస్తున్నారు. మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో వైద్య పరీక్షల కోసం దూరప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మా గ్రామాలకు సమీపంలో వైద్య సేవలు, రక్త, యూరిన్ పరీక్షలు జరుగుతున్నాయి.

–గొర్లె కృష్ణమూర్తి, మహాశింగి, సారవకోట మండలం

అందుబాటులో సిబ్బంది



పీహెచ్‌సీలో ప్రస్తుతం ఇద్దరు వైద్యులం వైద్య సేవలందిస్తున్నాం. గిరిజన గ్రామాల ప్రజలకు అందుబాటులో సిబ్బంది ఉంటున్నారు. రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందిస్తున్నాం. ఇక్కడ ఆధునిక వైద్య పరికరాలు ఉన్నాయి. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ డి.సుధారాణి, వైద్యులు, బొంతు పీహెచ్‌సీ, సారవకోట మండలం

సీఎం జగన్‌తోనే స్వర్ణయుగం సాధ్యం

- ఎమ్మెల్యే రెడ్డిశాంతి

హిరమండలం: ముఖ్యమంత్రిగా రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే ఆంధ్రరాష్ట్ర ప్రజలు స్వర్ణయుగాన్ని చూస్తారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని హిరమండలంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. సంక్షేమ పథకాలన్నీ ఇంటివద్దకే అందాలంటే జగన్ మరోసారి గెలిచి తీరాలని.. దీనికి అందరూ కృషి చేయాలన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల కోసం నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సైనికుల్లా పనిచేయాలని కోరారు. మండల పార్టీ కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

కొత్తూరు: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసిన పనులపై సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి ఎంపీడీవో త్రివిక్రమరావు సూచించారు. మండలంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సామాజిక తనిఖీలకు సంబంధించిన బృందాలు, ఫీల్డు అసిస్టెంట్లు, సిబ్బందితో స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏపీవో ప్రేమలత ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. తనిఖీ బృందాలకు ఫీల్డు అసిస్టెంట్లు సహకరించాలన్నారు. గ్రామ సభలకు సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, వేతనదారులు హాజరయ్యేలా చూడాలన్నారు. తనిఖీ బృందాలు ఇంటింటా తనిఖీలు చేసే సమయంలో ఫీల్డు అసిస్టెంట్లు ఉండకూడదన్నారు. చివరి వేతనం పడిన తేదీ వరకు జాబ్ కార్డులు అప్‌డేట్ చేసి ఉంచాలన్నారు. తనఖీ బృందాలకు అవసరమైన రికార్డులు అందించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఆర్‌సీపీ ఎం.వెంకటరావు, డబ్ల్యూఎంఏ ఎల్.గోవిందరావు, ఈసీ శ్రావణి ఉన్నారు.

సేవా వజ్రకు ఇద్దరు వలంటీర్ల ఎంపిక

నరసన్నపేట: లుకలాం గ్రామానికి చెందిన ఇద్దరు వలంటీర్లకు అరుదైన గౌరవం దక్కింది. ప్రభుత్వం ఇచ్చే సేవా వజ్ర పురస్కారానికి వలంటీర్లు తమ్మిన పార్వతి, ఆకుల సంతోష్‌కుమార్ ఎంపికయ్యారు. అలాగే సేవారత్న పురస్కారాలు దూకులపాడుకు చెందిన బత్తుల ఈశ్వరరావు, కరగాంకు చెందిన రావాడ మాధవి, నరసన్నపేట-2 సచివాలయానికి చెందిన బడ్డ దుర్గాప్రసాద్, మడపాం గ్రామానికి చెందిన చింతు శేఖర్, కంబకాయకు చెందిన గుజ్జిడి గోవిందరావులకు వరించాయి. ఈ వివరాలను నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి స్థానిక విలేకర్లకు గురువారం తెలిపారు. సేవా వజ్ర పురస్కారానికి రూ. 45 వేలు, రత్న పురస్కారానికి రూ. 30 వేలు ప్రభుత్వం అందించనుంది.

వలంటీర్ల సేవలు ఎంతో అవసరం



కొత్తూరు: సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ఎంతో సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ల సేవలు ప్రజలకు ఎంతో అవసరమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో వలంటీర్లతో గురువారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ఎంతో బాధ్యతగా పనిచేస్తున్న వలంటీర్లను ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరన్నారు. కరోనా సమయంలో అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతీ నెల ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేస్తుండడం అభినందనీయమన్నారు. వీరి సేవలను మెచ్చే ప్రభుత్వం మూడు విభాగాల్లో వారికి నగదు పురస్కారాలతో సత్కరిస్తోందన్నారు. టీడీపీ, జనసేన పార్టీల నాయకులు వలంటీర్లనుద్దేశించి దిగజారుడు మాట్లాడడం తగదన్నారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, శిమ్మ సాంబశివరావు, లోచర్ల మల్లేశ్వరావు, ముగడ జనార్దన, ముద్దాడ లక్ష్మణరావు, బలగ గోవిందరావు, తలసముద్రం శోభన్‌బాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమల్లో వలంటీర్లే కీలకం

కొత్తూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరవేయడంలో వలంటీర్లే కీలకమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరులో గ్రామ వలంటీర్లు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో గురువారం సిద్ధం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో గ్రామ వలంటీర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థతో అవినీతి రహిత పాలన ప్రజలకు అందుతుందన్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థలతో ప్రజలకు అందుతున్న సేవలను చూసి దేశంలోని పలు రాష్ట్రాలు ఈ రెండు వ్యవస్థలను అనుసరించడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండలంలోని 27 గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, ఏఎంసీ డైరెక్టర్ సారిపల్లి హరి, మండల కార్యదర్శులు పంకజదాస్, మటం పూర్ణ, సర్పంచ్‌లు కుంచాల రత్నాలు, సాధుబాబు, చక్రపాణి, వైకుంఠరావు, వనుము లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదస్థలంలో క్షతగాత్రులు

ఆమదాలవలస: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన పట్టణ పరిధిలోని రైల్వే అండర్ టన్నెల్ వద్ద గురువారం సాయంత్రం జరిగింది. రెండు బైకులు ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఎస్‌ఆర్ దాబాలో కుక్‌గా పని చేస్తున్న ఒడిశాకు చెందిన దీపక్ నాయక్ బుల్లెట్‌పై, మున్సిపాలిటీ ఆరో వార్డు టి.మన్నయ్యపేటకు చెందిన జాడ దుర్గారావు ద్విచక్ర వాహనంపై వస్తూ పరస్పరం ఢీకోవడంతో గాయపడ్డారు. క్షతగ్రాతులను 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన దుర్గారావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆమదాలవలస ఎస్‌ఐ చెప్పారు.

రథసప్తమి పూజలకు సిద్ధం

సరుబుజ్జిలి: పురుషోత్తపురం సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు అర్చకులు బంకుపల్లి వెంకటసత్యగోపాలరావు గురువారం తెలిపారు. వేకువజామునుంచే స్వామివారి నిజరూప దర్శనం, క్షీరాభిషేకాలు, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఆలయం ఆవరణలో సూర్య నమస్కారాలు, హోమం చేయనున్నట్లు పేర్కొన్నారు.

నరసన్నపేట: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా భక్తుల దర్శనానికి పక్కాగా ఏర్పాట్లు చేశామని అర్చకుడు జోష్యుల వేణుగోపాలశర్మ తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామునుంచి రాత్రి పది గంటల వరకూ స్వామి దర్శనానికి భక్తులను అనుమతి ఇస్తామన్నారు.

అధికారుల దృష్టికి గిరిజనుల సమస్యలు

సారవకోట: గిరిజనుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు బ్రెడ్స్ ఏపీఐపీ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జేపీ రమణ తెలిపారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని పలు గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులతో మండలస్థాయి అధికారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రభుత్వ ప్రథకాలపై అవగాహన, ప్రకృతి వ్యవసాయం, కస్టం హైరింగ్ సెంటర్ల ద్వారా గిరిజన రైతులకు యంత్రాలు అద్దెకు ఇవ్వడం వంటి కార్యక్రమాలన చేపడుతున్నామన్నారు. ఈఓపీఆర్డీ రేణుక, డీటీ మధుబాబు, ఏపీవో నారాయణరావు, ప్రకృతి వ్యవసాయం ఎంటీ రమణ, ఫీల్డ్ కోఆర్డినేటర్ ధర్మారావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారవకోట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు టెక్కలి ఈఈ జి.శంకరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అలుదు ఫీడర్‌లో నిర్వాహణ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం



టి.లింగాలుపాడులో మాట్లాడుతున్న కృష్ణదాస్

- అభివృద్ధి పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



చల్లవానిపేటలో ఉన్నత పాఠశాల భవనాలు ప్రారంభిస్తున్న కృష్ణదాస్ తదితరులు

జలుమూరు: పేదలకు అండగా నిలుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అన్ని వర్గాల ప్రజల విశాల ప్రయోజనం కోసం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు అంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాల భవనాలను, మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో అభివృద్ధి పనులను, ఇంటింటికీ కుళాయిలు, బస్‌షెల్టర్, శ్రీముఖలింగం గ్రామ ముఖద్వారం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మునుపెన్నుడు లేని విధంగా విద్య, వైద్యం, వ్యవసాయానికి కోట్లాది రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరువ చేశామన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామన్నారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి పేద పిల్లలకు సైతం కార్పొరేట్‌స్థాయి విద్యను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మహిళలకు సముచిత గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలను వారిపేరుతోనే అమలు చేశామన్నారు. కరోనా సమయంలో కూడా సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించామని గుర్తు చేశారు.

ప్రారంభాలు ఇలా..

రావిపాడులో ఇంటింటికీ కుళాయిలను, లింగాలవలస పంచాయతీ ఉసిరికజ్వాలలో కుళాయిలు, చల్లవానిపేటలో పంచాయతీ భవనం, ఉన్నత పాఠశాల నూతన భవనాలను, టి.లింగాలుపాడులో హెల్త్ సెంటర్, యలమంచిలిలో ఇంటింటికీ కుళాయిలను, కొమనాపల్లి జంక్షన్‌లో ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. అలాగే శ్రీముఖలింగంలో గ్రామ ముఖద్వారం ఏర్పాటు, మర్రివలస పంచాయతీ బైరాగిపేటలో ఇంటింటికీ కుళాయి పనులను, పర్లాం, అందవరం సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్, అల్లాడలో సచివాలయం, గొటివాడ పంచాయతీ మహ్మద్‌పురంలో కుళాయిలు, అక్కివలసలో ఇంటింటికీ కుళాయిలు, రాణ పంచాయతీ బావాజీపేటలో కుళాయిలను, కరవంజలో అంగన్‌వాడీ భవనం, సీసీ రోడ్డు ,కోనేరు అభివృద్ధి పనులను, మోడల్ స్కూల్‌లో భవనాల పనులకు శంకుస్థాపన చేశారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ వాన గోపి, అల్లాడ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, పి.రాజప్పల నాయుడు, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జీజీ రమణి, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, బుక్కా లక్ష్మణరావు తోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పి.భారతి, పి.విజయ్, బోర సింహాచలం, కన్నయ్య, కె.హరిప్రసాద్, బీవీ రమణ, జుత్తు నేతాజి తదితరులు ఉన్నారు.

కళింగ-రుగడ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని శోధ గ్రామ సమీపంలో రూ. 2 కోట్ల స్టేట్ డెవలప్‌మెంట్ స్కీం నిధులతో చేపట్టనున్న కళింగ-రుగడ రోడ్డు పనులకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయన్నారు. నియోజకవర్గంలో రూ.7.4 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ సాగర్, జేఈ గోపాలరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, వైస్ ఎంపీపీ గంగు శోభారాణి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న, మండల కార్యదర్శి జి.రాము, నాయకులు గేదెల సూర్యం, ఆనంద్, వెంకటలక్ష్మి, పసుకు మోహన్, కె.లక్ష్మీనారాయణ, మురళీ ఆప్టో, ఇప్పిలి ధనుంజయ, గోల సంజీవరావు, బోని గిరి, శివ, తూలుగు ప్రవీణ్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు



155 కిలోల బరువు ఎత్తుతున్న గోవిందరావు

సారవకోట: కిన్నెరవాడ గ్రామంలో జిల్లాస్థాయి బల ప్రదర్శన పోటీలను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి, గ్రామదేవత ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు పంచిరెడ్డి సూర్యనారాయణ, రాంబాబు ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 155 కిలోల బరువు ఎత్తి ఆవల గోవిందరావు ప్రథమ, 140 కేజీలు ఎత్తిన షేక్ రజాక్ ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారు.

అలాగే మహిళల విభాగంలో పి.రాజ్యలక్ష్మి, సీహెచ్ హారిక ప్రథమ, ద్వితీయ స్థానాలో నిలిచారు. 80 కిలోల విసురుగుండు విభాగంలో గేదెల సత్యన్నారాయణ, షెక్ రజాక్‌లు మొదటి రెండు రెండుస్థానాల్లో, 104 కిలోల సంగిడీ విభాగంలో గేదెల సత్యన్నారాయణ, ఆవల గోవిందరావులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో, 200 కిలోల ఈడ్పు సంగిడీ విభాగంలో ఆవల గోవిందరావు, గేదెల సత్యన్నారాయణ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి నిర్వాహకులు దాము సత్యన్నారాయణ, ఇప్పిలి వేణు గోపాలరావు, పంచిరెడ్డి రాంబాబు బహుమతులు అందజేశారు. కిన్నెరవాడ, వడ్డినవలస గ్రామాల్లో 2016 నుంచి జరుగుతున్న బల ప్రదర్శన పోటీల్లో ఆవల గోవిందరావు విశేష ప్రతిభ కనబర్చుతుండటంతో ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

సంక్షిప్తంగా..

చిన్నకిట్టాలపాడు విద్యార్థినుల ప్రతిభ



రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థినులు

సారవకోట: చిన్నకిట్టాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినులు టెక్కలిలో జరిగిన ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబర్చారు. బిన్ ఫ్రీ కిచెన్ ఇన్ హోం అనే ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేష్ తెలిపారు. జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న కరణం శ్రావ్య, ఉపాధ్యాయులు కేవీ రమణమూర్తి, రామయ్యల సహకారంతో ఈ ప్రదర్శన ఇచ్చినట్టు చెప్పారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ఎల్.ఎన్.పేట: జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ ఏఈ కె.రమేష్ అన్నారు. మిరియాపల్లి, తురకపేట, దబ్బపాడు, బొత్తాడసింగి, పెద్దకొల్లివలస, సుమంతాపురం గ్రామాల్లో పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు.

రోడ్డు పనులు ప్రారంభం

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలోని పురుషోత్తం నగర్ కాలనీ మొదటి వీధిలో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ బూరల్లి శంకర్ గురువారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ నిధులు రూ. 5 లక్షలతో రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్, నాయకులు పతివాడ గిరీశ్వరరావు, అందవరపు పాపారావు ఉన్నారు.


మధ్యాహ్న భోజనం పరిశీలన

నరసన్నపేట: పిల్లలకు పెడుతున్న మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉండాలని ఎంఈవోలు యు.శాంతారావు, పేడాడ దాలినాయుడు అన్నారు. శాంతారావు సత్యవరం ఉన్నత పాఠశాల, దూకులపాడు ప్రాథమికోన్నత పాఠశాలను, దాలినాయుడు జమ్ము స్కూల్‌ను సందర్శించి భోజనాన్ని పరిశీలించారు.

అటవీ హక్కుల చట్టంపై అవగాహన

పాతపట్నం: అటవీ హక్కుల చట్టం-2006 ప్రాప్తికి హీబిటేట్, రికార్డ్స్ ఆఫ్ రైట్స్‌పై గిరిజనులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని వెలుగు అసోసియేషన్ రిసోర్స్‌పర్సన్ ఎ.చిరంజీవి అన్నారు. శోభ పంచాయతీ పరిధి కరడాసింగి గూడలో అటవీ హక్కుల చట్టంపై గిరిజనులకు గురువారం అవగాహన కల్పించారు. ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు, సమన్వయకర్త జి.జగన్నాథం పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళాశాల వార్షికోత్సం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ తవిటినాయుడు

బూర్జ: విద్యార్థులు చక్కగా చదివి ఉన్నతస్థాయిలో నిలవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడు అన్నారు. కళాశాల 19వ వార్షికోత్సవం గురువారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. గత ఏడాది పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఠాగూర్, అధ్యాపకులు పాల్గొన్నారు.